సాక్షి
వికారాబాద్
సోమవారం । 21 । ఆగస్టు । 2023



నిధుల వరద

తాండూరు నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎట్టకేలకు నిధులను మంజూరు చేసింది. 8లో▸



డ్రోన్‌తో వ్యవ'సాయం'

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పంటలకు పురుగు మందుల పిచికారీకి డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. 8లో▸



రహదారులకు మహర్దశ

దౌల్తాబాద్ మండలంలోని గ్రామీణ ప్రాంత రహదారులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మహర్దశ పట్టనుంది. 9లో▸

న్యూస్‌రీల్

దేశానికే ఆదర్శం తెలంగాణ

మంత్రి సబితారెడ్డి



పెట్రోల్ పంపును ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు

మోమిన్‌పేట: తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శమని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని దేవరంపల్లి వద్ద సీఎంఆర్ పెట్రోల్ పంపును వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగుకు ఉచిత విద్యుత్, రైతు బంధు, బీమా, రుణమాఫీ, సాగు నీరు, పంట కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతును ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డీ వెంకట్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ మాదే అధికారం

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మోమిన్‌పేటలో పార్టీ మండల అధ్యక్షుడు డీ వెంకట్ ఆధ్వర్యంలో సుమారు 100మంది ముస్లింలు కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి క్యూ కట్టారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ - జేబీఎస్‌కు 'నాన్‌స్టాప్' సేవలు

హయత్‌నగర్: ఎల్‌బీనగర్- జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్) రూట్‌లో రద్దీ సమయాల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నాన్‌స్టాప్ బస్సు సర్వీసు(90ఎల్) సేవలను సోమవారం ఉదయం నుంచి ప్రారంభించనున్నట్లు హైదరాబాద్ రీజినల్ మేనేజర్ బి.వరప్రసాద్, డీఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 5.10నుంచి 6.30వరకు ప్రతి 15నిమిషాలకు ఒక బస్సు ఉంటుందన్నారు. హయత్‌నగర్-2 డి పో, బండ్లగూడ డిపోల నుంచి 6 మెట్రో బస్సు లు ఈ రూట్‌లో నడుపుతామన్నారు. టికెట్ ధర రూ.40 కాగా బస్‌పాస్‌లు చెల్లవని స్పష్టం చేశారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోల్‌కట్ట సమీపంలోని కళాశాలలో హిస్టరీ బోధన కోసం పార్ట్‌టైం ప్రాతిపదికన లెక్చరర్‌గా పని చేసేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం ఉండాలని, పీహెచ్‌డీ, నెట్ సెట్ చేసినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 22న 4 గంటలలోగా తోల్‌కట్ట సమీపంలోని డిగ్రీ కళాశాలలో తమ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 82470 62851 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మోగింది కల్యాణవీణ

షాబాద్: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కల్యాణ ఘడియలు రానేవచ్చాయి. జూన్ 18 నుంచి ఇప్పటి వరకు ఆషాఢం, అధిక శ్రావణ మాసంతో శుభ ముహూర్తాలకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఈ నెల 19 నుంచి సుముహూర్తాలు తిరిగి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి మొదలైంది. మండపాలు ముస్తాబయ్యాయి. పెళ్లి సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు కళకళలాడుతున్నాయి.

శుభముహూర్తాలు ఇలా..

ఈనెల 19, 20, 22, 24, 26, 29, 30, 31. సెప్టెంబర్ 1, 2, 3, 6, 7, 8. అక్టోబర్ 18, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 31. నవంబర్ 1, 2, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 28, 29. డిసెంబర్ 3, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 19, 20, 21, 24, 31 తేదీలు.



అనంతగిరి గుట్టలో సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

సన్‌డే.. ఫన్‌డే

వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. అడవిలో విహరిస్తూ సంతోషంగా గడిపారు. కుటుంబ సభ్యులు, చిన్నారులు ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా గడిపారు. అందమైన ప్రదేశాల్లో సెల్ఫీలు దిగారు. అయితే ఇటీవల ఇక్కడ జరిగిన కారు, బైకుల స్టంట్లతో అప్రమత్తమైన అటవీశాఖ ప్రత్యేక చెక్ పోస్టును ఏర్పాటు చేసింది.

– అనంతగిరి



అడవిలో విహరిస్తున్న పర్యాటకులు

లాభాలపై హైరానా..!

- మద్యం షాపుల దరఖాస్తుదారుల్లో మొదలైన ఆందోళన
- గ్రూపులుగా ఏర్పడి ఒక్కో షాపునకు వందల్లో అప్లికేషన్లు
- ఆదాయం మొత్తం దరఖాస్తు డబ్బులకే సరిపోతుందేమోనని అనుమానం
- నష్టం ఉండదంటున్న విశ్లేషకులు
- ఎన్నికల ఏడాది కావడంతో 40శాతం వ్యాపారం పెరగవచ్చని అంచనా
- నేడు లక్కీ డ్రా ద్వారా షాపుల కేటాయింపు



ఇటీవల వికారాబాద్‌లో టెండర్లు వేసేందుకు వచ్చిన వ్యాపారులు

వికారాబాద్: మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఆందోళన మొదలైంది. దాదాపు అన్ని షాపులకు గ్రూపుల వారీగానే దరఖాస్తు చేశారు. ఒక్కో గ్రూపులో వందల సంఖ్యలో వ్యాపారులు ఉండడంతో లాభాలపై మదన పడుతున్నట్లు తెలుస్తోంది. ఒక వేళ లక్కీ డ్రాలో షాపు వచ్చినా లాభాలు మొత్తం దరఖాస్తు డబ్బులకే సరిపోతుందేమోనని హైరానా పడుతున్నారు. జిల్లాలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి మద్యం దుకాణాలకు పోటీ పెరిగింది. 2021తో పోలిస్తే దాదాపు మూడింతల దరఖాస్తులు వచ్చాయి. టెండర్లు వేసిన వారిలో సగానికిపైగా కొత్తవారే ఉన్నారు. దీంతో వారిలో ఆందోళన నెలకొంది. పెట్టిన పెట్టుబడికి ఏమైనా లాభాలు వస్తాయా ? లేదా దరఖాస్తు డబ్బులకే పోతాయా ? అనే మీమాంసలో పడిపోయారు. గతేడాది జిల్లాలోని 59 మద్యం షాపులకు 923 దరఖాస్తులు రాగా ఈ ఏడాది అదే షాపులకు 2,637 అప్లికేషన్లు వచ్చాయి. దీంతో లాభాల విషయంలో ఆందోళన మొదలయ్యింది. అయితే మద్యం పాలసీ, జిల్లాలో అమ్మకాలు, వచ్చేది ఎన్నికల సీజన్ కావడం సానుకూల అంశాలని విశ్లేషకులు అంటున్నారు. పెట్టుబడికి ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని ఓ ఎక్సైజ్ అధికారి తెలిపారు.

సానుకూల అంశాలు

ఈ ఏడాది మద్యం వ్యాపారంలోకి కొత్త వారు రావడంతో పాటు వ్యాపారుల మధ్య నెలకొన్న పోటీ కారణంగా దరఖాస్తులు భారీగా పెరిగాయి. అయితే సానుకూల అంశాలు ఉండడంతో లాభాలు కూడా ఉంటాయని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. గతంలో లైసెన్స్ రెంటల్ ఫీజుకు ఏడింతల అమ్మకాల వరకు 20 శాతం మార్జిన్ ఉండేది. గత సీజన్ నుంచి ఆ మొత్తాన్ని పదింతల వరకు పెంచారు. అంతేకాకుండా ఈ ఏడాది ఎన్నికల సీజన్ కావడం వ్యాపారులకు కలసి రానుంది. వరుస బెట్టి ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక సంస్థలైన మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ, మున్సిపల్, సహకార సంఘం తదితర ఎన్నికలు జరగనుండడం కలిసొచ్చే అంశమని పలువురు పేర్కొన్నారు. దీంతో అమ్మకాలు భారీగా పెరిగే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో సగటున నెలకు 59 మద్యం దుకాణాల్లో రూ. 70 కోట్ల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఎన్నికల సీజన్ కావడంతో విక్రయాలు 40శాతం వరకు పెరిగి నెలకు రూ. 100 కోట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అమ్మకాలు భారీగా పెరగటంతో పాటు ఈ ఏడాది టెండర్, రెంటల్ ఫీజును ప్రభుత్వం పెంచకపోవడం వల్ల వ్యాపారులకు ఊరట కలిగించే అంశం. ఈ ఏడాది మద్యం వ్యాపారం లాభాల బాటలోనే పయనిస్తుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నేడు లక్కీ డ్రా



సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియం హాల్‌లో కలెక్టర్ సమక్షంలో మద్యం దుకాణాలకు లక్కీ డ్రా తీస్తాం. దరఖాస్తుదారులు ఉదయం 9గంటలకే కలెక్టరేట్‌కు చేరుకోవాలి. వారి కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వసతులు కూడా కల్పించాం. షాపుల వారీగా సగం మందిని ముందుగా ఆడిటోరియంలోకి పంపుతాం. మిగిలిన వారు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన టెంట్లలో ఉండాలి. లక్కీ డ్రా అనంతరం షాపులు దక్కించుకున్న వారు రెంటల్ ఫీజులో నిర్దేశిత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయి.

– నవీన్‌చంద్ర ఎక్సైజ్ సూపరింటెండెంట్, వికారాబాద్

వచ్చే ఎన్నికల్లో విజయం మాదే

- సోలాపూర్ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దేశ్‌ముఖ్
- 'ఎమ్మెల్యేల ప్రభాస్ యోజన'లో భాగంగా వికారాబాద్‌కు రాక
- పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో కర్ణాటక ఎమ్మెల్యేల పర్యటన

వికారాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహారాష్ట్ర సోలాపూర్ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దేశ్‌ముఖ్ బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యేల ప్రభాస్ యోజనలో భాగంగా ఆయన ఆదివారం వికారాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తమదే విజయమని పేర్కొన్నారు. తెలంగాణలో ని 119 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ప్రభాస్ యోజన కొనసాగుతోందన్నారు. వారం రోజుల పాటు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, మాధవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవనాయక్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, నాయకులు అమరేందర్‌రెడ్డి, విజయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరాలి: కృష్ణనాయక్

పరిగి: పరిగి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరాలని కర్ణాటక రాష్ట్రం హడగల్లి ఎమ్మెల్యే కృష్ణనాయక్ అన్నారు. ఆదివారం పరిగి పట్టణంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలన్నారు. ఎన్నికలకు మూడు నెలల సమయం మాత్రమే ఉందని, అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేయాలన్నారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, పార్లమెంట్ విస్తారక్ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, రాష్ట్ర నాయకులు రాములు, శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, కేశవులు, పెంటయ్య, బాలకృష్ణ, యాదయ్య పాల్గొన్నారు.

కొడంగల్ బాధ్యతలు కిరణ్‌కుమార్‌కు..

కొడంగల్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గ బాధ్యతలను బీజేపీ ఆ పార్టీ కర్ణాటక రాష్ట్రం కుందాపూర్ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు అప్పగించింది. ఆదివారం ఆయన కొడంగల్‌కు వచ్చారు. వారం రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి బీజేపీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర శిక్షణ విభాగం కో కన్వీనర్ బస్వరాజ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కూర వెంకటయ్య, నాయకులు మదన్, పున్నం చంద్, నర్సింలు, బాబయ్య నాయుడు, చంద్రప్ప, సర్వేశ్, మోహన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ అర్బన్: మాట్లాడుతున్న సోలాపూర్ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దేశ్‌ముఖ్

కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు



సిరిగాయపల్లిలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న రామ్మోహన్‌రెడ్డి తదితరులు

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 2లక్షల రుణమాఫీ
- ఎకరాకు రూ. 15వేలు రైతుబంధు అమలు
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కెరవెల్లి, సిరిగాయపల్లి గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ హామీ అమలు కాలేదని ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటి మాయమాటలతో ప్రజలను మభ్య పెట్టారని ఆరోపించారు. తెలంగాణ వస్తే మా బతుకులు బాగుపడతాయని భావించిన ప్రజల ఆశలు తీరలేదన్నారు. వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ హయాంలో 42వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించామని గుర్తు చేశారు. మా పార్టీ అధికారంలోకి రాగానే రూ. 2లక్షల రైతు రుణ మాఫీ, ఎకరాకు రూ. 15వేలు రైతు బంధు, బంగారు తల్లి పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. రైల్వే లైన్ పరిగికి రాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని, మోదీ నోట్ల రద్దుకు, రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్‌ఎస్ మద్దతు తెలిపిందన్నారు. అనంతరం రెండు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పి సతీష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, షకీల్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు అనుసూజ, మాజీ ఎంపీపీ భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు.. చిత్తు

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి గుప్పుమంటోంది. యువతను లక్ష్యంగా చేసుకుని ఈ విక్రయాలు సాగిస్తున్నారు. సందర్భం ఏదైనా గంజాయిని సేవిస్తూ బానిసలుగా మారుతున్నారు. పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు.

- గుప్పుమంటున్న గంజాయి
- గ్రామీణ ప్రాంతాలే లక్ష్యంగా వ్యాపారం
- కర్ణాటక నుంచి రవాణా
- పరిచయం ఉన్న వ్యక్తులకే విక్రయం
- బానిసలవుతున్న యువత



దౌల్తాబాద్: గంజాయి మత్తులో యువత చిత్తవుతోంది. సరదాగా ఆకర్షితులై దానిని వ్యసనంగా మార్చుకుంటున్నారు. కొద్ది రోజుల తర్వాత మత్తు లేకుంటే బతకలేమనే స్థితికి దిగజారుతున్నారు. కేవలం యూత్‌ను టార్గెట్ చేస్తున్న కొందరు గంజాయి వంటి మత్తు పదార్థాలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని యువత గంజాయి మత్తులో జోగుతోంది. జల్సాలు.. షికార్లు.. వ్యసనాలకు బానిసలై దారి తప్పుతున్నారు. తెలిసి తెలియని వయస్సులో నేరాలకు పాల్పడుతున్నారు. దౌల్తాబాద్ మండలం కర్ణాటక సరిహద్దులో ఉండడంతో అక్కడి నుంచి కొందరు గంజాయి తెస్తున్నట్లు తెలుస్తోంది. చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో సిగరెట్లలో గంజాయిని నింపి ఎవ్వరికీ అనుమానం రాకుండా ప్రత్యేక కోడ్‌లతో విక్రయిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో..

మండల కేంద్రంతోపాటు చల్లాపూర్, గోకఫసల్వాద్, అంతారం గ్రామ యువకులు గంజాయి తాగుతూ మత్తులో మునిగి తేలుతున్నారు. అలాగే కొడంగల్ మండలం అంగడిరయిచూర్, చిట్లపల్లి, రావల్‌పల్లి గ్రామాల్లో యువత అడ్డాలుగా మార్చుకున్నారు. అయితే విక్రయదారులు తమకు పరిచయం ఉన్న వ్యక్తులకే గంజాయి విక్రయిస్తున్నారు. ఈ విషయం ఇటీవల పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో కీలక వ్యక్తులపై నిఘా పట్టారు. వారం రోజుల క్రితం కర్ణాటక నుంచి గంజాయి తెస్తున్న వ్యక్తిని స్థానిక పెద్ద చెరువు కట్టపై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 950గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. కొడంగల్ మండలంలో కూడా గంజాయి తెస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చర్యలు తీసుకుంటాం



మండలంలో గంజాయి విక్రయంపై నిఘా పెంచాం. ఇప్పటికే ఒక కేసు నమోదు చేశాం. పిల్లలు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. గంజాయి విక్రయించడం చట్టరీత్యా నేరం. ఇలాంటి వాటిపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌కుమార్, ఎస్‌ఐ, దౌల్తాబాద్

మానవ హక్కులను కాపాడుకోవాలి

మొయినాబాద్‌రూరల్: సమాజంలో మానవ హక్కులను తెలుసుకొని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జాతీయ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ పీఆర్‌వో సయ్యద్ ఇస్రత్ జైన్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న అన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం జాతీయ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషనర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు.

ఆశల పల్లకిలో..

- తాండూరు అసెంబ్లీ టికెట్ కోసం ఉద్యమనేత ప్రయత్నాలు
- పట్నం వెనుకడుగుతో శుభప్రద్‌పటేల్‌లో చిగురించిన ఆశలు



ఇటీవల సీఎం కేసీఆర్‌ను కలిసిన శుభప్రద్‌పటేల్

తాండూరు: తాండూరు అసెంబ్లీ టికెట్ కోసం బీఆర్‌ఎస్ నేతలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికే టికెట్ ఖరారైందని జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే బీఆర్‌ఎస్ జంబో జాబితాలో తాండూరు టికెట్ విషయం తేల్చలేదనే లీకులు వచ్చాయి. దీంతో టికెట్ ఆశిస్తున్న వారిలో ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో రెండు మూడు రోజులుగా సీఎం కేసీఆర్‌తో పాటు పార్టీ ముఖ్యనేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు నిమగ్నమయ్యారు. తాండూరు టికెట్ కోసం ప్రయత్నిస్తున్న వారిలో ఉద్యమ నేత, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తాండూరు రాజకీయాల్లో శుభప్రద్‌పటేల్ క్రియాశీలకంగా ఉన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నాడు కేసీఆర్ నేతృత్వంలో విద్యార్థి సంఘం ఉద్యమ నేతగా ఆయన వెంట నడిచారు. అప్పటి ప్రభుత్వాలు పదుల సంఖ్యలో కేసులు పెట్టినా వెనక్కి తగ్గలేదు. రాష్ట్రం సిద్ధించిన తరువాత శుభప్రద్‌పటేల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసారి ఎలాగైనా టికెట్ సాధించాలని పట్టుదలతో ఉన్నారు. పక్షం రోజులుగా పార్టీ ముఖ్య నేతలను కలిసి తాండూరు టికెట్ తనకే ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు తాండూరు ప్రాంతంలో బలమైన లింగాయత్ సామాజిక వర్గాన్ని తన వైపునకు తిప్పుకొంటున్నారు.

క్లుప్తంగా

పేకాట స్థావరంగా డంపింగ్‌యార్డు

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ధారూరు: డంపింగ్‌యార్డు షెడ్‌లో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం .. మండల పరిధిలోని స్టేషన్‌ధారూరులోని డంపింగ్ యార్డు షెడ్‌ను పేకాట స్థావరంగా మార్చారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి గ్రామానికి చెందిన బావుసింగ్, చందర్, రవి, మోహన్, హీరు, మహదేవ్ తదితరులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి వద్ద పేకాట ముక్కలు, రూ.11,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పాము కాటుకు ఆవు మృతి



ఆవు కళేబరం వద్ద రైతు

దోమ: పాముకాటుకు ఆవు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం .. గ్రామానికి చెందిన పుట్నాల వెంకటయ్య జీవనోపాధితో పాటు వ్యవసాయం కోసం ఆవులు, ఎద్దులను కొనుగోలు చేసుకున్నాడు. పశువులను పొలంలో మేతకు తీసుకెళ్లగా అందులో ఓ ఆవును నాగు పాము కాటు వేసింది. ఈ క్రమంలో ఆవు నురగలు కక్కుతూ అక్కడికి అక్కడే మృతి చెందింది. జీవనోపాధి కోసం తెచ్చుకున్న ఆవు మృతి చెందడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ఆవు విలువ సుమా రు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం తన ను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసి మీ అకౌంట్ నెంబర్, ఏటీఎం నెంబర్, బ్యాంకు వివరాలు, ఓటీపీ అడిగితే చెప్పకూడదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలాన్నారు. ఆన్లైన్‌లో గేమ్‌లు ఆడటం తదితరాలను ప్రోత్సహించొద్దన్నారు. అనుకోని పరిస్థితులలో మన స్నేహితులు, బంధువులు, చుట్టుపక్కల వారు సైబర్ నేరాలకు గురైతే 24 గంటల లోపు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో రిపోర్ట్ చే యాలని అవగాహన కల్పించాలన్నారు. లేదంటే 1930 నంబర్‌కు ఫోన్ చేయలని సూచించారు.

రైలు ఢీకొని మహిళ మృతి



ఈశ్వరమ్మ (ఫైల్)

ధారూరు: పుట్టింటి నుంచి అత్తారింటికి వస్తున్న మహిళను రైలు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని మైలారం కొత్తతండా సమీపంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండల పరిధిలోని కుమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన గాజుల ఈశ్వరమ్మ(40) అనారోగ్యానికి గురవ్వడంతో వారం రోజుల క్రితం చింతకుంటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. ఆదివారం ఆమె తిరుగు ప్రయాణం అయింది. కుమ్మర్‌పల్లి నుంచి చింతకుంటకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేదు. చింతకుంటకు ధారూరు, స్టేషన్ ధారూరు, దోర్నాల్, నాగారం మీదుగా వెళ్లేందుకు ఆటో ఛార్జీలు ఎక్కువ అవుతాయని భావించింది. ఈ క్రమంలో అడ్డదారిలో నడక ప్రారంభించింది. మార్గ మధ్యలో రైల్వే వంతెన కింద నడుములోతు వరకు వరదనీరుండడంతో పట్టాల మీదుగా వెళ్లేందుకు యత్నించింది. ఈ క్రమంలో వేగంగా వచ్చిన హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆమె ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న తాండూర్ రైల్వే పోలీసులు శవాన్ని తాండూరు రైల్వే ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తాండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్: ఆరుబయట కూర్చున్న వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఈఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. వనం యాదమ్మ, గోపాల్ దంపతులు గుంతపల్లిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 15న తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో నిద్రలేచిన గోపాల్ ఇంటి ఎదుట కూర్చుని ఉండగా భార్య గమనించింది. మరో అరగంటకు వచ్చి చూడగా కనిపించలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

నియోజకవర్గానికి నిధుల వరద

- పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ.61.40కోట్లు మంజూరు
- జీఓ జారీచేసిన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

మండలం	కేటాయించిన నిధులు
పెద్దేముల్	రూ.21.32కోట్లు
తాండూరు	రూ.19.40కోట్లు
యాలాల	రూ.14.42కోట్లు
బషీరాబాద్	రూ.6.20కోట్లు



తాండూరు నియోజకవర్గంలోని రోడ్డు దుస్థితి

తాండూరు: నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎట్టకేలకు నిధులను మంజూరు చేసింది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పంచాయతీ రోడ్ల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖకు రూ.100 కోట్లకు పైగా ప్రతిపాదనలు పంపించారు. పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం మొదట 43 గ్రామాలకు రోడ్డు పనులు ప్రారంభించేందుకు రూ.61.40కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్‌సుల్తానియా జీఓ ఆర్‌టీ నెంబర్ 431 ఆమోదముద్ర వేశారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పంచాయతీ రోడ్లకు మహర్దశ పట్టనుంది.

విడతల వారీగా నిధులు

తాండూరు నియోజకవర్గ పరిధిలో గ్రామాల రోడ్లు ఏళ్ల నుంచి అధ్వాన్నంగా మారాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నియోజకవర్గంలో విడతల వారీగా రోడ్లు మెరుగుపడుతున్నాయి. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో గతంలో తాండూరు అభివృద్ధికి రూ.134కోట్ల నిధులు మంజూరు చేయించారు. తాజాగా మరోసారి నాలుగు మండలాలకు రూ.61.40కోట్ల నిధులు తీసుకురావడంలోనూ సక్సెస్ అయ్యారు.

గుంతలుండని రోడ్లు చూస్తారు



నియోజకవర్గ పరిధిలో రానున్న రోజుల్లో రోడ్లపై గుంతలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నా. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతో మరోసారి తాండూరుకు రూ.61.40కోట్లు మంజూరు అయ్యాయి.

– పంజుగుల రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే తాండూరు

టమాటా ఆటోబోల్తా

- కూలీ మృతి
- మరో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలిలో మొగులమ్మ మృతదేహం

దౌల్తాబాద్: బతుకుదెరువు కోసం కూరగాయాలు అమ్మేందుకు వెళ్తూ ఓ మహిళ ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కొడంగల్ పట్టణానికి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మిరపకాయల యాదయ్య కూరగాయాల వ్యాపారి. ఈయన ఆంధ్రా తదితర ప్రాంతాల నుంచి బులెరో వాహనంలో కూరగాయలు తీసుకువచ్చి సంతల్లో హోల్‌సేల్‌గా విక్రయిస్తుంటాడు. అయితే ఆదివారం బొంరాస్‌పేట మండలం తుంకిమెట్లలో వారాంతపు సంత ఉండడంతో భార్య లక్ష్మి, గ్రామానికి చెందిన మరో ఇద్దరు మహిళలు కుర్మని మొగులమ్మ(30), తోక దస్తమ్మతో కలిసి సంతకు తమ బొలెరో వాహనంలో బయలుదేరారు. మొగులమ్మ, దస్తమ్మ వాహనంపైనున్న కూరగాయాల ట్రేలపై కూర్చున్నారు. కొడంగల్ పట్టణానికి సమీపంలోని ఎల్లమ్మగుడి వద్ద మలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో మొగులమ్మపై ట్రేలు పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. దస్తమ్మ, వాహనం కేబిన్‌లో కూర్చున్న లక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు బతుకుదెరువుకోసం కూలి పనులతో పాటుగా వారాంతపు సంతల్లో కూరగాయాలు విక్రయిస్తుండేది. బతుకుపోరాటానికి బయలుదేరి వెళ్లి అరగంట కాకముందే బతుకు తెల్లారిందని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతురాలి తల్లి హన్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

త్వరలో భారీగా వలసలు



మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

- మంత్రి సబితారెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరంలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసి సీఎం కేసీఆర్‌కు కానుక ఇస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమీర్‌పేట్, మహేశ్వరం, సిరిగిరిపురం గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా నియోజకవర్గంలో వందల కోట్ల నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్‌ఎస్ గెలుపు ఆపలేవన్నారు. నియోజకవర్గంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు, 30 పడకల ఆస్పత్రి నూతన భవనం, డైట్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు ప్రతీ గ్రామంలో డబుల్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. త్వరలో బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి భారీ ఎత్తున బీఆర్‌ఎస్‌కు వలసలుంటాయని చెప్పారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మల్లేశ్, అంబేడ్కర్ యూత్ అమీర్‌పేట్ గ్రామ అధ్యక్షుడు సురేశ్, నర్సింహ, శ్రీకాంత్, సంజీవ, సిద్దులు, నర్సింహ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అంబయ్య యాదవ్, రాయప్ప, చంద్రయ్య, అమీర్‌పేట్ ఉప సర్పంచ్ నర్సింగ్, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆదిల్, యూసుఫ్ పటేల్, వెంకటేశ్, రవి, రాజు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

‘డ్రోన్’తో వ్యవ‘సాయం’

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పంటలకు పురుగు మందుల పిచికారీకి డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ డ్రోన్లతో రైతులు ఎదుర్కొంటున్న కూలీల కొరత తీర్చేందుకు పరిష్కారంగా కనిపిస్తోంది.



పత్తి పంటలో గడ్డి మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

- కూలీల కొరతకు చెక్
- ధర ఎక్కువైనా సకాలంలో పనులు పూర్తి
- నూతన విధానానికి అలవాటు పడుతున్న గ్రామీణ రైతులు

ధారూరు: వ్యవసాయం అంటేనే రైతు నిత్యం శ్రమించడం. కాలానుగుణంగా చేస్తున్న వ్యవసాయంలో అందరూ ఒకే సమయంలో పనులు ప్రారంభిస్తారు. అదే సమయంలో రైతులకు కూలీల అవసరం ఎంతో ఉంటుంది. సాగులో సమయం దాటి పోతే పంట ఉత్పత్తి సరిగ్గా రాదనే భావన. సాగు పనులు మొదలు పెడితే దుక్కి దున్నడం నుంచి పంటను సేకరించే వరకు రకరకాల పనులు కూలీల ద్వారా చేయించాల్సి ఉంటుంది. డబ్బులు వెచ్చించినా కూలీలు దొరకని పరిస్థితి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు డ్రోన్లు వినియోగంలోకి వచ్చాయి. అవి క్రమంగా పట్టణ ప్రాంతాల నుంచి పల్లెలకు చేరాయి. ప్రస్తుతం పురుగు నివారణకు, గడ్డి నివారనకు డ్రోన్లను వినియోగిస్తూ మందులు పిచికారీ చేయిస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలకు డ్రోన్లు వినిగిస్తున్నారు. దీని వలన మందుల వృధాతో పాటు కూలీల కొరతను అరికట్ట వచ్చునని రైతులు చెబుతున్నారు.

అరగంటలో ఒకరోజు పని

ధారూరు మండలంలో కొత్తగా ఈ సంవత్సరం డ్రోన్ల సహాయంతో గడ్డి, క్రిమి సంహారక మందుల పిచికారీ చేయిస్తున్నారు. మందుల పిచికారి చేయడానికి గ్రామీణులు చేతి పంపులు, తైవాన్ పంపులను వినియోగిస్తున్నారు. దీంతో నీళ్లు మోయడానికి ఇద్దరు, మందు పిచికారికీ ఇద్దరు, పంపుల్లో మందు నీళ్లు పోయడానికి మరో ఇద్దరు చొప్పున కూలీల అవసరం ఉంటుంది. ఎకరా పొలం ఉన్న వారికి ఇద్దరు కూలీలు సరిపోతారు. కూలీలు దినమంతా పిచికారీ చేస్తే డ్రోన్ అదే పనిని అర గంటలో పూర్తిచేస్తుంది. డ్రోన్లను వినియోగించేవారు మాత్రం నిష్ణాతులై ఉండాలి. మందును ఏ పంటకు ఎంత ఎత్తులో డోన్‌ను ఉంచి పిచికారీ చేయాలనేది తప్పక అవగాహన ఉండాలి. లేదంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉంటుందని డ్రోను వినియోగిస్తున్న దస్తయ్యగౌడ్, ప్రకాశ్లక్ష్మ్‌గౌడ్‌లు తెలిపారు. కూలీలకు ఇచ్చే డబ్బుల్లో సగం డబ్బులు వ్యయం చేస్తే నిమిషాల్లో పని పూర్తి చేస్తామని వారు వివరించారు. వీరు ధారూరు మండల పరిధిలోని నాగారం, నాగ్‌సాన్‌పల్లి గ్రామాలకు చెందిన యువకులు. ప్రస్తుతం పత్తి, కంది, మొక్కజొన్న పంటలకు డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేస్తున్నారు.

పోలీసుల అత్యుత్సాహం సరికాదు



లక్ష్మిని పరామర్శిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

బడంగ్‌పేట్: తప్పు చేసిన పోలీసులు మరో తప్పు చేసి బక్షక బటులని నిరూపించుకున్న పాలన కేసీఆర్ ప్రభుత్వంలోనే జరుగుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన ఎల్‌బీనగర్ పోలీసుల అత్యుత్సాహానికి బలైన బాధితురాలు లక్ష్మిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌పీ మాట్లాడుతూ.. విషయం తెలుసుకోకుండా ఒక గిరిజన బిడ్డపై ఇంతా దారుణంగా వ్యవహరిస్తారా? అని పోలీసులపై మండి పడ్డారు. కర్మన్‌ఘాట్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని అర్ధరాత్రి హుటాహుటిన 200మంది పోలీసులతో వచ్చి బలవంతంగా వేరే ఆస్పత్రికి తరలించడం వెనక ప్రభుత్వం, పోలీసుల తప్పు స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఈ ఘటన పోలీసు వ్యవస్థకే మచ్చ అన్నారు. లక్ష్మిపై దారుణంగా హింసించిన పోలీసులను డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు.

రూ.50వేల ఆర్థికసాయం

విషయం తెలుసుకున్న బీజేపీ మహేశ్వరం నియోజకర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆదివారం బాధితురాలిని పరామర్శించారు. అయాయక గిరిజన మహిళపై దాడికి పాల్పడిన పోలీసులను సొసైటీలోనే తిరగనివ్వవద్దని అన్నారు. పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం బాధితురాలు లక్ష్మి ఆస్పత్రి ఖర్చులకు రూ.50వేలు అందజేశారు.

పుష్కరిణిలో పడి వ్యక్తిమృతి



కిష్టయ్య మృతదేహం

చేవెళ్ల: ప్రమాదవశాత్తు పుష్కరణిలో పడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మ ండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన నక్కలపల్లి కిష్టయ్య(61) పనినిమిత్తం మండల కేంద్రానికి వచ్చాడు. కాళ్లకు బురద అంటడంతో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని పుష్కరిణిలో శుభ్రం చేసుకునేందుకు వెళ్లాడు. మెట్లపై కూర్చుని కాళ్లు కడుక్కునే క్రమంలో కాలుజారి పుష్కరిణిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే బయటకు తీసినా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘ఎప్పుడొస్తావు.. నాయనా..’

- లద్దాఖ్ ప్రమాదంలో కొందుర్గు వాసి దుర్మరణం
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు
- స్వగ్రామంలో విషాదఛాయలు



చంద్రశేఖర్ (ఫైల్)



చంద్రశేఖర్ ఇంటివద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

కొందుర్గు: నిరుపేద కుటుంబం.. చిన్నతనం నుంచే దేశ సేవ చేయాలనే సంకల్పం.. ఆటుపోట్లను అధిగమిస్తూనే పదో తరగతి పూర్తయిన వెంటనే సైన్యంలో చేరాడు.. 12 ఏళ్ల పాటు దేశ సేవలో తరించాడు.. విధి చిన్నచూపు చూసింది.. ప్రమాదవశాత్తు లద్దాఖ్ వద్ద లోయలో పడిపోయిన సైనికుల వాహనంలో ప్రాణాలు వదిలాడు.. తొమ్మిది మంది సైనికులు ప్రాణాలు విడిచిన వీర జవాన్లలో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగెళ్లపల్లి పంచాయతీ పరిధిలోని తిరుమని దేవునిపల్లికి చెందిన నీరటి చంద్రశేఖర్ ఒకరు. విషయం తెలిసిన వెంటనే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేశ సేవ చేయాలనే తపనతో..

తిరుమని దేవునిపల్లికి చెందిన నీరటి లక్ష్మమ్మ, మల్లయ్య దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ముగ్గురు కుమారులు. ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ఇద్దరు కుమారులు వ్యవసాయం, కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు చంద్రశేఖర్(30) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదివాడు. 8 నుంచి 10వ తరగతి వరకు కొందుర్గులోని హాస్టల్‌లో ఉంటూ చదివాడు. దేశ సేవ చేయాలనే తపనతో పదో తరగతి పూర్తికాగానే 2010లో సైన్యంలో చేరాడు. 2017లో షాబాద్ మండలం కక్కులూర్ గ్రామానికి చెందిన లాస్యతో వివాహం జరిగింది. వీరికి వర్షిత (4), సహస్ర (2) ఇద్దరు కూతుళ్లు. పెళ్లయిన కొన్నాళ్లకే చంద్రశేఖర్ విధి నిర్వహణలో భాగంగా వెళ్లడంతో భార్య, పిల్లలు, తల్లి లక్ష్మమ్మ షాద్‌నగర్‌లో అద్దెకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు.

రెండు నెలల్లో వస్తానన్నాడు..

ఈ ఉగాది ఏప్రిల్‌లో తన బావమరిది పెళ్లికోసం వచ్చిన చంద్రశేఖర్ పదిహేను రోజులపాటు ఉండి వెళ్లిపోయాడు. వెళ్లే సమయంలో తిరిగి రెండు నెలల్లో వస్తానని తల్లి, భార్యాపిల్లలతో చెప్పాడు. ఇంతలోనే చంద్రశేఖర్ మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ×ఎప్పుడొస్తావు.. నాయనా..₹ అంటూ చంద్రశేఖర్ తల్లి బోరున విలపించడంతో స్థానికులు కంటతడి పెట్టారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం తిరుమని దేవునిపల్లి చేరుకొని చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం బీజేపీయే



షాద్‌నగర్: మంగళూరు సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



మొయినాబాద్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే చంద్రప్ప, బీజేపీ నాయకులు

- కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి
- మంగళూరు సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాస కామత్

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం బీజేపీయే అని మంగళూరు సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాస కామత్ అన్నారు. ఆదివారం ఆయన బీజేపీ అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ విచ్చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. దేశాభివృద్ధి ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలని సూచించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలను వివరించాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీయం కేసీఆర్ పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్‌లో కాషాయ జెండా ఎగురవేసేందుకు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్, డాక్టర్ విజయ్‌కుమార్, అందె బాబయ్య, మిథున్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కమ్మరి భూపాలాచారి, వెంకటేష్‌గుప్తా, వెంకటేశ్వర్‌రెడ్డి, రుషికేష్, మహేందర్ రెడ్డి, నాగరాజు, నర్సింహయాదవ్, సుధాకర్, శ్రీశైలం, వెంకటేష్ యాదవ్, కుర్మయ్య పాల్గొన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వం

మొయినాబాద్: తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమని కర్ణాటక వలెంకెర్ ఎమ్మెల్యే ఎం చంద్రప్ప అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని రాహుల్ ఫాంహౌస్‌లో ఆదివారం బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాలకు చెందిన 119 మంది ఎమ్మెల్యేలను రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా నియమించింది. అందులో భాగంగా చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కర్ణాటక ఎమ్మెల్యే చంద్రప్ప ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 19 ఎస్సీ నియోజకవర్గాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా చేవెళ్లలో ఈ నెల 23న అసెంబ్లీ బూత్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కష్టపడి పనిచేస్తే చేవెళ్లలో గెలుపుఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. 23న నిర్వహించనున్న అసెంబ్లీ బూత్ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ బూత్ సమ్మేళన వాల్‌పోస్టర్‌ను వారు విడుదల చేశారు.

ప్రేమకు పెద్దల నిరాకరణ

- యువకుడి ఆత్మహత్యా యత్నం
- సకాలంలో స్పందించిన పోలీసులు

మీర్‌పేట: ప్రేమకు బాలిక కుటుంబ సభ్యులు నిరాకరించడంతో యువకుడు నిద్రమాత్రలు వేసుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమాన్‌నగర్ రోడ్ నెం –3లో నివాసముండే జంపల్లి శ్రీరాంరెడ్డి స్థానికంగా బాయ్స్ హాస్టల్ నడిపిస్తున్నాడు. ఇతని కుమారుడు అజయ్‌రెడ్డి (23) దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఇనిస్టిట్యూట్‌లో సీఏ కోర్సులో శిక్షణ పొందుతున్నాడు. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలిక(17), అజయ్‌రెడ్డిలు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వారం రోజుల క్రితం అజయ్‌రెడ్డి వీరి ప్రేమ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఆదివారం సాయంత్రం తన బైక్‌పై బడంగ్‌పేట్ శివారు షరీఫ్‌నగర్‌లోని నిర్మానుష్యప్రాంతానికి వెళ్లి నిద్రమాత్రలు వేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తల్లికి వాట్సాప్ చేశాడు. తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్ లొకేషన్ ద్వారా పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న అజయ్‌రెడ్డిని హుటాహుటిన మంద మల్లమ్మ చౌరస్తాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

వ్యక్తికి తీవ్రగాయాలు

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలం సిలివేరుకు చెందిన బాలస్వామి ఆదివారం బైక్‌పై హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కందుకూరు చౌరస్తా సమీపంలోని నవారు బాల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్ ఎదుట ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బాలస్వామికి తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.